ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



జగిత్యాల
జిల్లా వార్తలు

5★★

మంగళవారం 2 డిసెంబరు 2025

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఏపీఎం

కథలాపూర్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూలూరు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సెర్ప్ ఏపీఎం చిన్న రాజయ్య పరిశీలించారు. కొనుగోళ్ల వేగవంతం చేయాలని, నిర్ణీత తేమ వచ్చాకే ధాన్యం తూకం వేయాలని సిబ్బందికి సూచించారు. రైతుల వివరాలు నమోదు చేసుకుని ఆన్‌లైన్ చేయాలన్నారు. పెగ్గెర్ల, పోతారం గ్రామాల్లో కొనుగోళ్లు పూర్తి చేశామని చెప్పారు.

మల్లాపూర్ విద్యుత్ ఏడీఈగా అమరేందర్

మల్లాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌కో అధికారులు ప్రకటించిన ప్రమోషన్ల విభాగంలో మల్లాపూర్ విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ అధికారిగా అమరేందర్‌ను నియమించారు. సోమవారం మల్లాపూర్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏడీఈగా అమరేందర్ బాధ్యతలు స్వీకరించారు. అమరేందర్ మెట్‌పల్లి ఏఈగా బాధ్యతలు స్వీకరించారు. అమరేందర్‌కు సిబ్బంది పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతించారు.

ఆర్థికసహాయం

ధర్మపురి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురికి చెందిన కొనపర్తి లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందగా మృతురాలి కుటుంబ పరిస్థితి తెలుసుకుని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామెర రాంసుధాకర్‌రావు ద్వారా సోమవారం కుటుంబ సభ్యులకు రూ.10,000 ఆర్థిక సాయం అందించారు. కొనపర్తి లక్ష్మి ఇటీవల రెండు కిడ్నీలు చెడిపోవడం వల్ల ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కూతురులు ఉన్నారు. విషయం తెలుసుకున్న రాంసుధాకర్‌రావు వెంటనే మృతురాలు కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా కార్యదర్శి బెజ్జారపు లవణ్, పోగుల గుండయ్య, గడిపెల్లి రాజమల్లయ్య, అర్జున్, శంకర్ పాల్గొన్నారు.

బుజ్జగింపులు షురూ..





- నామినేషన్లు ఉపసంహరించుకునేలా ప్రయత్నాలు
- పూర్తయిన మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ
- రేపటితో తేలనున్న అభ్యర్థులు

జగిత్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం పూర్తవగా బుజ్జగింపుల పర్వం మొదలైంది. బరిలో ఎవరు ఉంటారు..ఎవరు ఉపసంహరించుకుంటారు అనేది ఈనెల 3వ తేదీన తేలనుంది. పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు తక్కువగా ఉండడంతో అభ్యర్థులు ప్రతీ ఓటును కీలకంగా భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన పార్టీల నుంచి మద్దతు పొందుతున్న అభ్యర్థులకు పోటీలో ఉన్న మిగితా వారు అడ్డంకిగా మారబోతున్నారు. నామినేషన్లు ఉపసంహరించుకునేలా బరిలో నిలిచిన వ్యక్తులతో కొందరు బేర సారలకు తెరలేపుతున్నారు. పెద్ద గ్రామ పంచాయతీలు, మండల కేంద్రాలుగా ఉన్న గ్రామ పంచాయతీల్లో గెలుపును ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. పలువురు అభ్యర్థులు ఎన్నికల్లో ఖర్చు పెట్టడానికి వెనకాడటం లేదు.

జోరుగా విందులు

చాలా రోజుల తర్వాత తమ వర్గానికి రిజర్వేషన్ రావడంతో చాలా మంది ఈ అవకాశాన్ని వదులుకునేందుకు ఇష్టపడడం లేదు. ఎంత ఖర్చయినా గెలువాలనే ఉద్దేశంతో ఉన్నారు. దీంతో గ్రామాల్లో ప్రలోభాలకు, బుజ్జగింపులకు తెరలేపారు. ఒకే పార్టీలో ఉంటున్న వారు ఇద్దరిద్దరు చొప్పున నామినేషన్లు వేయడంతో వారిని బుజ్జగించే ప్రయత్నంలో ఆయా పార్టీ నాయకులు ఉంటున్నారు. ప్రధానంగా ఒకే వర్గం నుంచి ఇద్దరు బరిలో ఉంటే తమ వర్గపు ఓట్లు చీలకుండా మరొకరు ఉపసంహరించుకునేందుకు పావులు కదుపుతున్నారు. కొద్దిగా అంగబలం, అర్థబలం ఉన్న వారు మాత్రం ఎంతో కొంత ముట్ట జెప్పి నామినేషన్ విత్ డ్రా చేయించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. మరోవైపు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో తక్కువ ఓటర్లు ఉంటారు కాబట్టి ప్రతీ ఓటు కీలకంగా అభ్యర్థులు భావిస్తున్నారు. దీనికి అనుగుణంగా గ్రామంలోని పెద్ద మనుషులు, కుల పెద్దల మద్దతు కోరుతున్నారు. నిజానికి ఎన్నికల రిజర్వేషన్లు ఖరారయినప్పటి నుంచే పోటీలో ఉండే అభ్యర్థులు విందులు ఏర్పాట్లు చేసి ఓట్లు పట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఏకగ్రీవాలపై నజర్

జిల్లాలో పలు చోట్ల నేతలు ఏకగ్రీవం వైపు ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార పక్షానికి సర్పంచ్, ప్రతిపక్షానికి ఉప సర్పంచ్ అన్న రీతిలో ఏకగ్రీవం చేసుకోవడానికి యత్నాలు జరుగుతున్నాయి. సర్పంచ్ కాకపోయినా కనీసం ఉప సర్పంచ్ పదవైనా దక్కించుకోవాలని వార్డు మెంబర్లకు గాలం వేస్తున్నారు. దీంతో ప్రస్తుతం జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూడా పెద్ద ఎత్తున ఖర్చు తప్పకపోవచ్చని చాలా మంది పోటీలో ఉన్న వారు భావిస్తున్నారు. ఇప్పటికైతే నామినేషన్ దాఖలు చేసినా మూడో తేదీ తర్వాత ఎంత మంది

మిగతా 8లో

మేజర్ గ్రామ పంచాయతీలే టార్గెట్..

జిల్లాలో మొదటి విడతలో 7 మండలాలు, 122 గ్రామ పంచాయతీల్లో 1,172 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలోని వేముల వాడ అసెంబ్లీ నియోజకవర్గంలో గల మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాలు, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని కోరుట్ల, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల్లో తొలి విడత ఎన్నికలు జరుగుతున్నాయి.

ముఖ్యంగా మేజర్ గ్రామ పంచాయతీలు, మండల కేంద్రాలుగా ఉన్న పంచాయతీల్లో గెలుపొందాలని పలు పార్టీల మద్దతు ఉన్న అభ్య ర్థులు భావిస్తున్నారు. పెద్ద పంచాయతీల్లో తమ ఉనికి నిలుపుకోవాలని ప్రధాన పార్టీలన్నీ భావిస్తున్నాయి. తమ పార్టీ మద్దతు ఇస్తున్న వ్యక్తిని గెలిపించు కోవడానికి కష్టపడుతున్నాయి. ప్రధానంగా మేడిపల్లి, భీమారం, కథలాపూర్, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, అయిలాపూర్, బండ లింగాపూర్ పంచాయతీల్లో గెలుపు కోసం ఎంతైనా ఖర్చు పెడదాం అనే ధోరణిలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

మలి విడతలో రెండో రోజు 337 సర్పంచ్ నామినేషన్లు

జగిత్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మలి విడతలో సోమవారం రెండో రోజు 144 సర్పంచ్ స్థానాలకు 337 నామినేషన్లు వచ్చాయి. 1,276 వార్డు స్థానాలకు గాను 1,041 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండో విడత నామినేషన్లను మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించనున్నారు.

మండలం	సర్పంచ్‌లు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
జగిత్యాల	5	15	50	51
జగిత్యాల రూరల్	29	67	268	182
రాయికల్	32	67	276	212
సారంగాపూర్	18	43	144	135
బీర్‌పూర్	17	26	136	96
మల్యాల	19	53	186	192
కొడిమ్యాల	24	66	216	173
మొత్తం	**144**	**337**	**1,276**	**1041**

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు

-ఎస్పీ అశోక్‌కుమార్



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

రాయికల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా జిల్లాలో పటిష్ఠ బందోబస్తు చేపట్టినటు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. రాయికల్ మండలంలోని అలూరు నామినేషన్ కేంద్రాన్ని సోమవారం వారు పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియను అక్కడి అధికారులతో అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఉన్న పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. నామినేషన్ కేంద్రాల్లోకి అనుమతి లేకుండా వ్యక్తులను పంపవద్దని అన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ సుధాకర్, ఎస్సైలు సుధీర్‌రావు ఉన్నారు.

ముందస్తు అవగాహనతోనే ఎయిడ్స్‌కు అడ్డుకట్ట

-జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ప్రభుత్వ ఆసుపత్రిలో రిజిస్టర్ తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ముందస్తు అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధికి అడ్డుకట్ట వేయవచ్చని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జగిత్యాల పట్టణంలోని గాంధీనగర్ ప్రాథమిక వైద్యశాలను ఆకస్మికంగా ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఎయిడ్స్ పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎయిడ్స్ రోగులను సమాజం నుంచి దూరం చేయకుండా వారికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎయిడ్స్ డే సందర్భంగా ఎలాంటి కార్యక్రమం చేపట్టారని ఆసుపత్రి సిబ్బందిని ప్రశ్నించారు. ఎలాంటి కార్యక్రమం చేపట్టలేదని సిబ్బంది సమాధానం చెప్పడంతో జిల్లా కేంద్రంలో ఈ ప్రాంతం ఎయిడ్స్ వ్యాధి విషయంలో క్లిష్టమైనదని ఇలాంటి ప్రాంతంలో ఎయిడ్స్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించక పోవడం ఏంటని వైద్యురాలిని ప్రశ్నించారు. ఆసుపత్రిలో రికార్డులను తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఎయిడ్స్ వ్యాధిపై ప్రచార కరపత్రాలు ఉన్నాయా అని అడిగ్గా లేవని సిబ్బంది చెప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ కౌన్సిలర్‌లు బాలె శంకర్, పంబాల రాము, పద్మావతి, నాయకులు జగన్మోహన్ రెడ్డి, పోతునుక మహేష్, నక్క గంగాధర్ పాల్గొన్నారు.

వీధులను పరిశుభ్రంగా ఉంచాలి

గాంధీనగర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అక్కడ మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది వీదులు శుభ్రం చేయడాన్ని చూసి నేను వస్తేనే వీధులు శుభ్రం చేస్తారా అని ప్రశ్నించారు. పట్టణంలోని వీధులన్నీ ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని వారికి సూచించారు.

నామినేషన్ల స్వీకరణలో పొరపాట్లకు తావివ్వొద్దు

జగిత్యాలరూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణలో పొరపాట్లకు తావివ్వొద్దని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు రమేష్ అధికారులకు సూచించారు. సోమవారం జగిత్యాల మండలంలోని మోతె గ్రామంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో విజయలక్ష్మి ఉన్నారు.

కాలనీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 4వ వార్డు సాయిరాం కాలనీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. హోలియా దాసరి సంఘ సభ్యులతో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. సంఘం అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, కాలనీలో మౌలిక వసతుల మెరుగుదలపై వివరించగా, అందుకు ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

నామినేషన్ల ప్రక్రియలో ఇబ్బందులు లేకుండా చూడాలి

జగిత్యాలరూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ స్వీకరణల ప్రక్రియను ఎన్నికల సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని జడ్పీ సీఈఓ గౌతమ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చల్‌గల్‌లో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ రమాదేవి, ఉన్నారు.

మహిళలకు రూ.1.09 కోట్ల వడ్డీ మాఫీ

కథలాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 864 మహిళా సంఘాలు తీసుకున్న రుణాలపై రూ. 1.09 కోట్ల వడ్డీ మాఫీ అయిందని సెర్ప్ ఏపీఎం చిన్నరాజయ్య చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీ మాఫీ చేస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ మేర కుగ్రామైఖ్య సంఘాల నుంచి వ్యక్తిగత ఖాతాలో జమయ్యాయని పేర్కొన్నారు.

మైక్రో అబ్జర్వర్లు సమయస్ఫూర్తిగా వ్యవహరించాలి

కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లు సమయస్ఫూర్తిగా వ్యవహరించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల విధులు, బాధ్యతలపై సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల సూక్ష్మపరిశీలకుల (మైక్రోఅబ్జర్వర్లు) పాత్ర కీలకమని, వారు ఇచ్చే నివేదిక ఆధారంగానే రీపోలింగ్‌కు ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

సూక్ష్మ పరిశీలకులు వ్యవహ రించాల్సిన పలు అంశాలపై సమ గ్రంగా వివరించారు. పోలింగ్ కేంద్రం లోపల అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా? లేదా అనే విషయాన్ని చెక్ లిస్ట్ ఆధారంగా పరిశీలించి నిర్ధారించుకోవాలన్నారు. జిల్లాలో 3,536 పోలింగ్‌స్టేషన్లకుగాను 110 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు, పోలింగ్‌కు ఒకరోజు ముందుగానే పోలింగ్ కేంద్రాలను మైక్రో అబ్జర్వర్లు చేరుకోవాలని సూచించారు. ఉదయం 78 గంటలకు పోలింగ్ ప్రారంభించాలని, మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించాలని, ప్రభుత్వం జారీ చేసిన 13 రకాల గుర్తింపు కార్డులను ఓటు హక్కు వినియోగించు కోవడానికి అనుమతించాలని సూచించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో బ్యాలెట్ బాక్సులను కిటికీల దగ్గర కనబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిర్ణీత సమయంలోపు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వస్తే వారికి టోకెన్‌లు ఇచ్చి ఓటు హక్కు వినియోగించుకు నేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్ర మంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్, ఎన్నికల పరిశీలకులు రమేశ్, మనోహర్, డీపీఓ రఘువరన్, జిల్లా నోడల్ అధికారులు బోనగిరి నరేశ్, రాము, రవికుమార్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

అగ్నిప్రమాద బాధితులకు రూ.20 వేల తక్షణ సహాయం

మల్యాల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కొండగట్టులో శనివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన 22 కుటుంబాలకు రెవెన్యూ అధికారులు రూ.20వేల చొప్పున సాయం అందించారు. ఆదివారం ప్రమాద ఘటన పరిశీలనకు వచ్చిన సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మన్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తక్షణ సాయం కింద బాధితులకు రూ.20వేల చొప్పున అందించాలని కలెక్టర్‌కు సూచించడంతో సోమవారం తహసీల్దార్ వసంత, ఆర్ తిరుపతి అందించారు. కాగ ఆదివారం కూడా రూ.5వేల చొప్పున అందించారు.

బాధితులకు దుస్తుల సేకరణ

జగిత్యాల అర్బన్: మూడు రోజుల క్రితం మల్యాల మండలం కొండగట్టులో జరిగిన అగ్ని ప్రమాద బాదితుల సహాయార్థం జగిత్యాల జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు శ్రీ శక్తి గణపతి ట్రస్ట్ ఆధ్వర్యంలో బట్టలు సేకరించి పంపించారు. ఈ కార్యక్రమంలో అలయ కమిటీ సభ్యులు ఉప్పులంచ శ్రీనివాస్, మధు, జ్యోతి, అర్చకులు రామానుజ శ్రీనివాస్, శ్రావణి సమఖ్య అధ్యక్షులు డిండిగాల విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో నిలిచిన రక్త నమూనాల సేకరణ

8 నెలలుగా బిల్లు చెల్లించడం లేదని వాహనాలు నిలిపివేసిన యజమానులు

జగిత్యాల టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో రక్త నమూనాల సేకరణ నిలిచిపోయాయి. వైద్యులు రోగం నిర్ధారణ అయితే దానికి అనుగుణంగా చికిత్స ప్రారంభించి మందులు రాస్తారు. పేద ప్రజలు రక్త పరీక్షలకోసం వేలల్లో డబ్బులు వెచించాల్సి వస్తుందని జిల్లా కేంద్రంలో అన్ని రకాల రక్త నామూనాల పరీక్షలు ఉచితంగా చేసేందుకు ప్రభుత్వం జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల సమీపంలో జిల్లా వైరాలజీ లాబోరేటరిని ఏర్పాటు చేసింది. ఈ ల్యాబ్‌కు జిల్లాలో ఉన్న 17 పీహెచ్‌సీలు, 5 యుపీహెచ్‌సీలు, జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిల నుంచి రోగుల వద్ద ప్రతిరోజు రక్త నమూనాలను సేకరిస్తారు. సేకరించిన నమూనాలను జిల్లా నలుమూలల నుంచి తీసుకుని వచ్చేందుకు 5 వాహనాలు అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నారు. అయితే ఆ వాహనాలకు ఒక్కోదానికి నెలకు అధికారులు రూ.33 వేలు చెల్లిస్తారు. అయితే 8 నెలలుగా బిల్లులు రాకపోవడంతో సోమవారం వాహన యజమానులు రక్త నమూనాల సేకరణకు వెళ్లకుండా వాహనాలను నిలిపివేశారు. దీంతో జిల్లాలోని పలు ప్రభుత్వ ఆసుపత్రులో సేకరించి రక్త నమూనాలు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. ఈ విషయంపై జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్‌ను వివరణ కోరగా రక్తనమూనాల సేకరణ నిలిచి పోయింది వాస్తవమేనని తొందరలోనే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.



వైరాలజీ ల్యాబ్ వద్ద నిలిపిన వాహనం

మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

కలెక్టర్ సత్యప్రసాద్‌కు రైతు సంఘ నేతల వినతి

జగిత్యాల, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): మిల్లర్ల అదనపు ధాన్యం దోపిడీని అరికట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్‌కు సోమవారం రైతు సంఘ నాయకులు వినతి పత్రం అందించారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి సమస్యను విన్నవించారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా మిల్లర్లు అదనంగా ఒక కిలో ధాన్యం డిమాండ్ చేస్తున్నారన్నారు.

జిల్లాలో లక్ష్మీపూర్ సొసైటీ పరిధిలోని సెంటర్లకు సం బంధించిన ధాన్యం దిగుమతి చేసుకోవడంలో మిల్లర్లు కొర్రిలు పెడుతున్నారని వాపోయారు. మిల్లర్లు సక్రమంగా ధాన్యం దిగుమతి చేసుకునే చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో పలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన మొక్కజొన్నకు సంబంధించిన డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపూర్ రైతు పరస్పర సహాయక సహకార సంఘం నాయకులు పొన్నాల తిరుపతి రెడ్డి, లింగారెడ్డి, రాజేందర్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు తరలివచ్చిన రైతు సంఘం నాయకులు

బాల్య వివాహాల నియంత్రణపై నజర్

- ప్రత్యేక బృందాలతో అవగాహన సదస్సులు
- నవంబరు 10నుంచి డిసెంబరు 6 వరకు కార్యక్రమాలు
- ప్రతి గ్రామంలో 14మందితో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీల ఏర్పాటు

7లో..

భావితరాల కోసమే నూతన విద్యుత్ ప్రాజెక్టులు

మాజీ మంత్రి జీవన్ రెడ్డి



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మూడు విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు కోసం తీసుకున్న నిర్ణయం భావితరాల కోసమేనని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధి విద్యుత్ ఉత్పత్తిపై ఆధారపడి ఉంటుందని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాలలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం విద్యుత్ ఆధారిత రాష్ట్రమని ఉచిత విద్యుత్ అమలుతో వ్యవసాయానికి ఎక్కువ విద్యుత్ వినియోగం అవసర మని భావించిన అప్పటి యూపీఏ ప్రభుత్వం రాష్ట్ర విభజనలో రాష్ట్రంపై భారం పడకుండా 2400 మెగా వాట్ల విద్యుత్ కేటాయించిందన్నారు. విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు పై ప్రతి పక్షాలు విమర్శలు మానుకోవాలన్నారు. చీరల పంపిణీ నిరంతర కార్యక్రమమని రాష్ట్ర ఎన్నికల సంఘం చీరల పంపిణీపై పునః సమీక్ష జరిపి పంపిణీకి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నూకపెల్లి డబుల్ బెడ్‌రూం కాలనీలో అన్ని వసతులు కల్పించినట్లు గుత్తేదారు పేపర్‌పై చూపిస్తున్నాడని సౌకర్యాలు కల్పించిన తర్వాత లబ్ధిదారులులు ఇళ్లలోకి ఎందుకు వెళ్లడం లేదని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. పట్టణంలో అనుమతులను మించి చేసిన నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, గాజుల రాజేందర్, మన్సూర్, కండ్లపెల్లి దుర్గయ్య, చీటి లక్ష్మీనారాయణ, భీరం రాజేష్, ముఖేష్ కన్న, ప్రదీప్, రఘువీర్, మధు పాల్గొన్నారు.

గుజరాత్‌లో రైలు ఢీకొని..
కరీంనగర్ విద్యార్థి దుర్మరణం


సాయివర్ధన్‌రెడ్డి(ఫైల్)

కరీంనగర్ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో రైలు ఢీకొన్న ఘటనలో కరీంనగర్ బొమ్మకల్ గ్రామానికి చెందిన విద్యార్థి మృతి చెందాడు. రాజ్‌కోట్‌లోని మార్వాడి యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గన్ను సాయివర్ధన్‌రెడ్డి(20) ఆదివారం దుర్మరణం చెందాడని కరీంనగర్ రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి తెలిపారు. మృతుడి తండ్రి గన్ను రాజిరెడ్డి బొమ్మకల్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేస్తూ, వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. ఆయనకు కొడుకు, కూతురు ఉన్నారు. కొడుకు సాయివర్ధన్‌రెడ్డి రాజ్‌కోట్ సిటీలో మార్వాడి యూనివర్సిటీలో హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఆదివారం సెలవు కావడంతో కరీంనగర్‌కు చెందిన మరికొందరు విద్యార్థులతో కలిసి సాయివర్ధన్‌రెడ్డి షాపింగ్ కోసం హాస్టల్ నుంచి ఔటింగ్‌కు వెళ్లాడు. ఆ సమయంలో రైలు క్రాసింగ్ వద్ద ప్రమాదం జరిగింది. సాయివర్ధన్‌రెడ్డి మరణవార్త తెలియగానే తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఉన్నతచదువుల కోసం గుజరాత్ రాష్ట్రానికి వెళ్లిన సాయివర్ధన్‌రెడ్డి పట్టాతో ఇంటికి వస్తాడనుకుంటే విగతజీవిగా మారాడని కుటుంబసభ్యులు రోదిస్తున్నారు. సాయివర్ధన్‌రెడ్డి మృతదేహాన్ని కరీంనగర్‌కు తీసుకొచ్చే ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం మృతదేహం బొమ్మకల్‌కు చేరుకోనున్నట్లు, బొమ్మకల్ గ్రామంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. సాయివర్ధన్‌రెడ్డి మృతికి పలువురు సంతాపం తెలిపారు.

విద్యుత్ వైర్లు అపహరణ

ఇల్లంతకుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్జీపూర్ గ్రామంలో వ్యవసాయ బావుల నుంచి విద్యుత్ వైర్ల అపహరణ జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గుండ శ్రీనివాస్ అనే రైతుకు చెందిన వ్యవసాయ బావివద్ద స్టార్టర్ నుండి బోర్‌మోటారుకు వెళ్లే 40మీటర్ల రాగివైరు సోమవారం అపహరణకు గురైంది. ఇదే గ్రామానికి చెందిన గుండ వెంకటేష్‌కు చెందిన 30మీటర్ల విద్యుత్ వైరు అపహరించుకొని పోయారు. కొద్దిరోజుల క్రితం ఎల్లమ్మగుడి సమీపంలోని బోరు వద్ద నుంచి 15మీటర్ల విద్యుత్ వైర్‌ను కత్తిరించుకొని పోయారు. గ్రామంలో వరుసగా బావుల వద్ద దొంగతనాలు జరుగుతున్నాయని, పోలీసులు స్పందించి దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుచున్నారు.

- మాడ్వీ హిడ్మా పురుడుపోసిన పీఎల్‌జీఏ
- సంచలనాల కొయ్యూర్ ఎన్‌కౌంటర్‌కు 25 ఏళ్లు
- నేటి నుంచి 8 వరకు పీఎల్‌జీఏ వారోత్సవాలు



కొయ్యూరు అమరత్వం.. పీఎల్‌జీఏ ఆవిర్భావం

మంథని, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విప్లవోద్యమ చరిత్రలో కొయ్యూరు ఎన్‌కౌంటర్ సంచలనం రేపింది. మావోయిస్టు అగ్ర నేతలు నల్లా ఆదిరెడ్డి, శీలం నరేష్, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డిలు మంథని నియోజకవర్గంలోని (ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా) మల్హర్ మండలం కొయ్యూరు అటవీ ప్రాంతంలో 1999 డిసెంబర్ 2న జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరులయ్యారు. వీరి మరణంతో ఆవిర్భవించిన మావోయిస్టు పార్టీ పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ)కు డిసెంబర్ 2తో 24 వసంతాలు నిండాయి. పీఎల్‌జీఏ పేరిట సైనిక బలగాన్ని ఏర్పాటు చేసుకుంది. మావోయిస్టు అగ్ర నేతలు దేశంలోని విప్లవ సంస్థలను ఒక్క తాటి మీదకు తీసుకురావడంలో వీరు చేసిన కృషి దేశ విప్లవోద్యమ చరిత్రలో చిరస్మరణీయమైంది.. యేటా డిసెంబరు 2 నుంచి 8 వరకు పీఎల్‌జీఏ వారోత్సవాలు కొనసాగుతున్నాయి.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని శంకరపట్నం మండలం కొత్తగట్టుకు చెందిన నల్లా ఆదిరెడ్డి, జగిత్యాలకు చెందిన శీలం నరేష్, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కడివెండి గ్రామానికి చెందిన ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డిలు తాడిత, పీడిత ప్రజల విముక్తి కోసం ఉన్నత చదువులను, కన్నవారిని వదిలి ఆయుధాలు చేతపట్టి అజ్ఞాతంలో ఉంటూ సాయుధ పోరాటం చేశారు. సామాన్య కార్యకర్తలుగా పీపుల్స్‌వార్ లో చేరిన ఈ ముగ్గురు కేంద్ర కమిటీ నాయ కుల స్థాయికి ఎదిగారు.

మావోయిస్టు పార్టీకి రక్షణ కవచంగా.. శత్రువులపై మెరుపు దాడులు చేయటానికి.. క్యాడర్‌లో పోరాట స్ఫూర్తిని నింపడానికి.. సాయుధ బలంగా.. సంచనాల అగ్రనేత మాడ్వీ హిడ్మా పురుడు పోసిన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) ఆవిర్భావానికి మంగళవారంతో రెండున్నర దశాబ్దాలు నిండాయి. ఇటీవల సంచలనం రేపిన మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత మాడ్వీ హిడ్మా మృతి చెందాడు. ఈ క్రమంలో పీఎల్‌జీఏ 25వ వారోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం అవుతున్నాయి.

● ధీరత్వానికి చిహ్నంగా బేగంపేటలో స్థూపం..


బేగంపేటలో కొయ్యూరు అమరవీరుల స్మారక స్థూపం(ఫైల్)

వారి వీరత్వానికి, త్యాగాలకు చిహ్నంగా నాటి పీపుల్స్‌వార్ (మావోయిస్టు) పార్టీ ప్రథమ వర్ధంతి సందర్భంగా పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్ జీఏ) పేరిట సైనిక బలగాన్ని ఏర్పాటు చేసుకుంది. దీంతో యేటా వారి స్మారకంగా డిసెంబర్ 2 నుంచి 8 వరకు పీఎల్‌జీఏ వారోత్సవా లను నిర్వహిస్తూ వ స్తోంది. వీరి స్మారకంగా మంథని డివిజన్‌లోని రామగిరి మండలం బేగంపేటలో మావో యిస్టు పార్టీ నిర్మించిన 53 అడుగుల ఎతైనా స్థూపాన్ని 2005 నవంబర్ 13న కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఆవిష్కరించారు.

● ఎంసీసీఐ-పీపుల్స్‌వార్ విలీనంతో పీఏల్‌జీఏగా మార్పు..

దేశంలోని రెండు అతి పెద్ద మావోయిస్టు పార్టీలైన సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్, ఎంసీసీఐలు 2004 సెప్టెంబర్ 21న విలీనమై దేశవ్యాప్తంగా విప్లవోద్యమాన్ని విస్తరించటానికి అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ-మావోయిస్టు)గా ఆవిర్భవించాయి. దీంతో పీపుల్స్ గెరిల్లా ఆర్మీని కొత్త పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఏల్‌జీఏ)గా మార్చారు. అప్పటి నుంచి పీఎల్‌జీఏ వారోత్సవాలుగా పిలుస్తున్నారు. పీఎల్‌జీఏ పూర్తిగా మావోయిస్టు కేంద్ర మిలటరీ కమీషన్ ఆధీనంలో పని చేస్తుంది.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఏడు రోజుల కమ్యూనిటీ సర్వీస్ శిక్ష

కరీంనగర్ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో దుబంబ మధు(47) అనే వ్యక్తికి కమ్యూనిటీ సర్వీస్ శిక్ష విధిస్తూ కరీంనగర్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ లక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షలో భాగంగా ఏడు రోజులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించే విధులు నిర్వహించాలని పేర్కొన్నట్లు తెలిపారు. అదేవిధంగా పలువురికి జరిమానాలు విధించినట్లు చెప్పారు.

మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

కోల్‌సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడుతూ రెండోసారి పట్టుబడిన ఓ వ్యక్తికి గోదావరిఖని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేష్ దురువ సోమవారం మూడు రోజుల జైలు శిక్ష విధించారు. మరో ఏడుగురుకి రెండు వేల రూపాయల చొప్పున జరిమానా విధించారు.

ఈత చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

మంథనిరూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లెపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు ఈత చెట్టు పైనుంచి కింద పడటంతో తాళ్లపల్లి సంతోష్‌గౌడ్ అనే గీతకార్మికుడికి సోమవారం గాయాలయ్యాయి. చెట్టుపై కల్లు గీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడటంతో సంతోష్ గౌడ్‌కు గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కుటుంబసభ్యులు కరీంనగర్‌కు తరలించారు.

డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దు


వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

హుజూరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి శివారులో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ డంపింగ్ యార్డు ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించిందన్నారు. కొత్తపల్లి సమీపంలో యూనిట్ నెలకొల్పడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, రైతులు ఆరోగ్యపరంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడే కాలుష్యంతో శ్వాసకోశ, చర్మ వ్యాధులు, అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. డంపింగ్‌యార్డు నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయా లని, నివాస ప్రాంతాలకు దూరంగా తరలించాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు ఖలీద్, రత్నం, రవీందర్‌బాబు, తిరుపతి, ప్రభాకర్, స్వామి, ప్రకాష్, వెంకటరమణ, రమేష్, గోపాల్ రావు, ముత్యంరాజు, శ్రీనివాస్‌చందు, రవీందర్, సంపత్, దశరథం, లడ్డు, అజ్జు, రాజేశ్వర్ రావు, లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

రాజన్న ఆలయ విస్తరణ పనులకు అంతరాయం

- అడుగులో భారీ రాళ్లు రావడంతో పనిచేయని డ్రిల్లింగ్ మిషన్స్


తిరిగి వెళ్తున్న భారీ డ్రిల్లింగ్ మిషన్

వేములవాడ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో చేపట్టిన విస్తర ణ పనులకు అంతరాయం ఏర్పడింది. ఆలయం లో రూ. 76 కోట్లతో నిర్మల్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ అభివృద్ధి పనులను చేపట్టారు. నెల రోజులుగా కొనసాగుతున్న పనుల్లో భాగంగా ఇటీవల వైజాగ్ నుంచి భారీ (బాహుబలి) డ్రిల్లింగ్ మిషన్, క్రేన్‌లను తెప్పించారు. ఈ మిషన్‌ల ద్వారా 33 అడుగుల లోతుతో పిల్లర్ గుంత లు తీస్తున్నారు. ఈ క్రమంలో మిషన్‌లకు భారీ రాళ్లు అడ్డుతగిలి డ్రిల్లింగ్ లోపలికి పోకుండా పక్కకు వెళ్తుండటంతో డ్రిల్లింగ్ పనులు చేయడం ఇబ్బందిగా మారింది. అడుగులో బండరాళ్లు రావడంతో విస్తరణ పనులకు ఆటంకం కలిగింది. ఆలయ డిజైనర్ ఆదేశాల మేరకు పనులు తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో డ్రిల్లింగ్ మిషన్, క్రేన్‌లు తిప్పిపంపారు. ప్రత్యామ్నాయంగా మట్టి తవ్వి పనులు చేపట్టడానికి రూపకల్పన చేస్తున్నట్లు రోడ్లు భవనాల శాఖ ఈఈ నర్సింహాచారి తెలిపారు.

హైదరాబాద్‌కు క్షతగాత్రుడి తరలింపు

- మృతదేహాలకు పోస్ట్‌మార్టం పూర్తి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగునూర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటనలో చామనపల్లికి చెందిన తొంటి రమేష్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సోమవారం ఉదయం హైదరాబాద్‌కు తరలించారు. మరో మహిళ హైమావతి చికిత్సపొందుతున్నది. ప్రమాదంలో మరణించిన రఘురాం, దేవేందర్‌రెడ్డి మృతదేహాలకు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి బాధిత కుటుంబాలకు అప్పగించారు.

● మృతుల కుటుంబాలను ఆసుపత్రి వద్ద కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

దాడి కేసులో నలుగురిపై కేసు

గంభీరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్‌కాలనీకి చెందిన గోల్లెని వెంకటనర్సు, గోల్లెని దేవేందర్, గోల్లెని నరసవ్వ, కవితలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గతంలో భూ వివాదంపై నలుగురు గోల్లెని నర్సయ్యపై కర్రలతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. సంఘటన సమయంలో అడ్డువెళ్లిన నర్సయ్య భార్య లక్ష్మి, కొడుకులు గోల్లెని కరుణాకర్, చందులపై కూడా కర్రలతో దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారని సీఐ తెలిపారు. నర్సయ్య కొడుకు కరుణాకర్ ఫిర్యాదు మేరకు వెంకటనర్సు, దేవేందర్, నర్సవ్వ, కవితలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కుక్కదాడిలో ఒకరికి గాయాలు

- మరో ఘటనలో లేగ దూడ మృతి

కోనరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కోలకాని ముత్తయ్య కుక్క దాడిలో గాయపడ్డాడు. మండల కేంద్రానికి చెందిన ముత్తయ్య వ్యవసాయ పనుల నిమిత్తం వెళుతుండగా వీధి కుక్క దాడి చేయగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. కాగా మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన అనుముల మహేందర్‌కు చెందిన లేగ దూడపై వీధి కుక్కలు దాడి చేయగా మృతి చెందింది. సుమారు రూ. 20 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరుతున్నాడు.

సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే ఫిర్యాదు చేయండి

-ఎస్పీ అశోక్ కుమార్ - చోరీకి గురైన 136 సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత



బాధితులకు మొబైల్ ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్లు పోగొట్టుకుంటే తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. జిల్లాలో పోగొట్టుకున్న, చోరీకి గురైన రూ.28లక్షల విలువ చేసే 136 సెల్‌ఫోన్లను సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బాధితులకు ఎస్పీ అశోక్ కుమార్ అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైనా సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చన్నారు. మొబైల్‌ఫోన్ వివరాలను సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే త్వరగా పట్టుకోవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.3.5 కోట్ల విలువ గల 1,548 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించా మన్నారు. ఎవరికైనా సెల్‌ఫోన్ దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్లో గాని, ఆ నబరుకు ఫోను చేసి అప్పగించాలని సూచించారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిన ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ రఫీక్ ఖాన్, సీఈఐఆర్ టీం ఆర్ఎస్ఐ కృష్ణ, హెడ్ కానిస్టేబుల్ మహమూద్, కానిస్టేబుల్ అజార్‌లను ఎస్పీ అభినందించారు.

కరీంనగర్ క్రైం: కరీంనగర్ బోయవాడకు చెందిన పి.వెంకటేష్ నవంబరు 18న గుంటూరుపల్లిలో ఫోన్‌ను పోగొటుకొని కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ నల్గొండలో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేశారు. సోమవారం రూరల్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి ఫోన్‌ను వెంకటేష్‌కు అప్పగించారు. ఫోన్ రికవరీలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామంలో ఫణి శ్రీనివాస్(48) కుటుంబ కలహాలతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్ఐ లక్ష్మణ్ సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని శ్రీనివాస్ వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంత కాలంగా కుటుంబంలో గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో శ్రీనివాస్ భార్య శోభ రెండేళ్ల క్రితం పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోవడంతో ఆయన ఒంటరిగా ఉంటున్నాడు. దాంతో మనస్థాపానికి గురై గత నెల 30న ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య శోభ, కూతుళ్లు మేఘన, సహస్ర, కొడుకు అక్షయ్ ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ లక్ష్మణ్ వివరించారు.

సీఐటీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

చొప్పదండి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఉప్పునూటి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర మహాసభల పోస్టర్లను సోమవారం చొప్పదండిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర 5వ మహాసభలు ఈ నెల 7, 8, 9న మెదక్‌లో జరగనున్నట్లు చెప్పారు. ఉద్యోగ, కార్మిక వర్గాలు తరలివచ్చి మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ హమాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు కొమ్మనవేని అశోక్, నాయకులు గుంట అంజయ్య, మారం సత్తయ్య, పిట్టల కొమురెల్లి, మారం గంగమల్లు, మంద మల్లేశం, అరిగే కరయ్య, రేగుల తిరుపతి, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి


బోల్తా పడిన ట్రాక్టర్

భీమారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రం నుంచి కాచారం రోడ్డులో సోమవారం ట్రాక్టర్ బోల్తా పడి వెంకటేష్ (41) అనే వ్యక్తి మృతిచెందాడు. భీమారం మండల కేంద్రానికి చెందిన కల్లెడ వినయ్‌కు చెందిన ట్రాక్టర్‌పై ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వెంకటేష్ కాచారం నుంచి భీమారం వైపునకు వస్తుండగా అదుపు తప్పి ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. గాయపడిన వ్యక్తిని స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వాహనం తనిఖీ


ఆది శ్రీనివాస్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

రుద్రంగి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలోని రెండు జిల్లాల సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వాహనాన్ని అధికారులు తనిఖీ చేశారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో ఆది శ్రీనివాస్ వాహనాన్ని అధికారులు ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మల్లికార్జున స్వామి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే


ఎమ్మెల్యే కవ్వంపల్లికి స్వామి చిత్రపటం అందజేస్తున్న నిర్వాహకులు

ఇల్లంతకుంట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో జరుగుతున్న మల్లికార్జున స్వామి ఉత్సవాల్లో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. రెండు రోజుల నుంచి జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, నాయకులు మహేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎలుక రామస్వామి, మామిడి రాజు, సుదగోని తిరుపతిగౌడ్, గుర్రం ఆదిరెడ్డి, సింగిరెడ్డి వెంకటరాంరెడ్డి, కమలాకర్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

శీతాకాలంలో సిరులు


కొనాయపల్లిలో క్యాలీఫ్లవర్ తోట

● క్యాలీఫ్లవర్ సాగుపై రైతుల దృష్టి


క్యాలీఫ్లవర్ సాగు చేస్తున్న రైతు శంకర్

వేములవాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీతాకాలంలో సిరులు కురుపించే క్యాలీఫ్లవర్ పంటపై రైతులు దృష్టిసారిస్తున్నారు. దిగుబడి సైతం అధికంగా రావడంతో రైతులు ఎక్కువ మొత్తంలో సాగు చేస్తున్నారు. వేములవాడ పట్టణ పరిధిలోని కొనాయపల్లి, నాంపల్లి, కురుమపల్లి, శాలరామన్నపల్లి గ్రామాల్లోని రైతులు క్యాలీఫ్లవర్ సాగుపై మక్కువ చూపుతున్నారు. క్యాలీఫ్లవర్ సాగుకు వేడి, తేమతో కూడిన వాతావరణం 20 నుంచి 27 డిగ్రీలు సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటే అనుకూలంగా ఉంటుంది. విత్తనాలను నర్సరీలో మే, జూన్ నెలలో నాటగా మొలకెత్తిన కొద్ది రోజులకు రైతులు నర్సరీల నుంచి కొనుగోలు చేసి దమ్ముచేసుకున్న భూమిలో అర అంగుళం లోతులో నాటుకోవాల్సి ఉంటుంది. మొక్క మొక్కకు మధ్య 18 అంగుళాల దూరం ఉండేలా ఏర్పాటు చేసుకుంటున్నారు. అవసరాన్ని బట్టి ఎరువులు, నీరు అందిస్తే అధిక దిగుబడులు ఆశించవచ్చు. వేములవాడ పట్టణంలోని కొనాయపల్లి గ్రామానికి చెందిన రైతు గోనె శంకర్ తనకు ఉన్న 20 గుంటల భూమిలో కొంత మేర పచ్చి మిర్చి, చిక్కుడు, బెండ సాగు చేయగా 10 గుంటల్లో క్యాలీఫ్లవర్ సాగు చేశాడు. క్యాలీఫ్లవర్ మొక్కలు నాటిన రోజు నుంచి 90 రోజులకు పంట కోతకు వచ్చింది. మార్కెట్‌లో కూడా మంచి ధర పలుకుతోందని చెపుతున్నాడు. క్యాలీఫ్లవర్ సాగులో అంతరపంటగా ఉల్లి పంటను సాగు చేసుకునే అవకాశం ఉన్నది.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



తలబడుతున్న కరీంనగర్-నల్లగొండ బాలుర జట్లు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం మినీ స్టేడియంలో పది ఉమ్మడి జిల్లాల 8వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల వాలీబాల్ పోటీలు సోమవారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. లీగ్ పద్ధతిలో బాలబాలికలకు వేరు వేరుగా నాలుగు కోర్టుల్లో పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు తమ అభిమతాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

● సెమీ ఫైనల్‌కు చేరిన బాలుర జట్లు వరంగల్, నిజామా బాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జట్లు, బాలికల్లో వరంగల్, నిజాబాద్, మహ బూబ్‌నగర్, నల్గొండ జట్లు సెమీ ఫైనల్‌కు చేరాయి. మంగళ వారం ఉదయం సెమీ ఫైనల్స్, సాయంత్రం ఫైనల్ పోటీలు జరుగనున్నాయి.

జాతీయ జట్టులో స్థానం సాధిస్తా..

- ముత్యాల మనోజ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు క్రీడాకారుడు



జాతీయ జూనియర్స్ వాలీబాల్ జట్టులో స్థానం సాధిస్తాను. 2023- 24లో సబ్ జూనియర్స్ అండర్-14 వెస్ట్ బెంగాల్, 2024-25 ఎస్‌జీఎఫ్ అండర్-17 విభాగంలో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన వాలీబాల్ జాతీయ స్థాయిలో పోటీల్లో రాష్ట్ర జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించాను.

జూనియర్స్‌లో బంగారు పతకం తెస్తాం..

- చల్ల సాహితీ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు క్రీడాకారిణి



జాతీయస్థాయి జూనియర్స్ పోటీల్లో తనకు అవకాశం వస్తే ఈసారి బంగారు పతకం సాధిస్తాం. మధ్యప్రదేశ్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నాను. సంగారెడ్డి జిల్లాలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాం.

అకాడమీ శిక్షణతో ఆట తీరు మారింది..

- విస్లావత్ నరేందర్, నిజామాబాద్ జిల్లా జట్టు క్రీడాకారుడు



వాలీబాల్ అకాడమీలో చేరాక నా ఆట తీరు మారింది. ఉదయం సాయంత్రం శిక్షణతో ఆటలో నైపుణ్యం సాధిస్తున్నాను. 2023, 2024లో సబ్ జూనియర్స్ అండర్-16, అండర్-17 విభాగాల్లో జరిగిన వాలీబాల్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ పోటీలలో ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. రాజస్థాన్‌లో జరగనున్న జూనియర్స్ జాతీయ పోటీలకు ఎంపిక అవుతానని నమ్మకం ఉంది.

ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు గుర్తింపు..

- గిన్నె లక్ష్మణ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రతిభ ఉన్న క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి జట్టులో స్థానం సాధిస్తున్నారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను 49వ జాతీయ స్థాయి బాలబాలికల జూనియర్స్ చాంపియన్‌షిప్ పోటీలకు రాష్ట్ర జట్టుకు ఎంపిక జరుగుతుంది. డిసెంబరు 16 నుంచి 20 వరకు రాజస్థాన్‌లో జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి.

బాల్య వివాహాల నియంత్రణపై నజర్





బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

- ప్రత్యేక బృందాలతో అవగాహన సదస్సులు
- డిసెంబరు 6వరకు కార్యక్రమాలు
- ప్రతి గ్రామంలో 14మందితో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీల ఏర్పాటు

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కొన్ని ప్రాంతాల్లో పేదరికం, నిరక్షరాస్యత, అభద్రతాభావం వంటి కారణాలతో బాల్య వివాహాలు చేస్తున్నారు. బాల్య వివాహాలతో బాలికల చదువు మధ్యలోనే ఆగిపోయి, వారి భవిష్యత్ వంటింటికే పరిమితం అయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. మరోవైపు చిన్న వయస్సులోనే గర్భవతి కావడంతో సదరు బాలిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీంతో జగిత్యాల జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా మార్చే దిశగా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. నవంబరు 10న ప్రారంభమైన అవగాహన సదస్సులు డిసెంబరు 6వరకు కొనసాగనున్నాయి. సదస్సుల్లో బాల్య వివాహ నిరోధక చట్టం-2006, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలను వివరిస్తూ విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్డీవో లేదా సబ్ కలెక్టర్, ప్రాజెక్టు స్థాయిలో సీడీపీవో (ఐసీడీఎస్), మండల స్థాయిలో తహసీల్దార్, సెక్టార్ స్థాయిలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ పర్యవేక్షిస్తారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి, వీవోఏలతో పాటు మరో 12మందిని కమిటీలో సభ్యులుగా చేర్చి చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను ఏర్పాటు చేశారు. బాల్యవివాహాల రహిత జిల్లాగా జగిత్యాలను మార్చేలా 20మండలాల్లో 19 బృందాలు ఏర్పాటు చేసి ఆయా గ్రామ పంచాయతీల్లో, జిల్లా పరిషత్ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

●బాల్య వివాహాల నిరోధక అధికారి విధులు

- జిల్లాలో బాల్యవివాహాలపై ఏదైనా ముందస్తు సమాచారం ఉంటే ఇరుపక్షాల తల్లిదండ్రుల ఇళ్లకు వెళ్లి బాల్యవివాహం చట్టం గురించి వివరించారు. బాల్య వివాహం జరగకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలి.

-పిల్లలతో మాట్లాడి బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించాలి.

-బాల్యవివాహం చేసుకోకుండా ఉండడం అతడి/ఆమె హక్కు అని తెలపాలి.

అవగాహనతోనే బాల్యవివాహాలకు అడ్డుకట్ట

-బోనగిరి నరేష్, పీడీ ఐసీడీఎస్, జగిత్యాల జిల్లా



జగిత్యాల జిల్లాలో బాల్యవివాహాలు అధికంగా జరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. బాల్య వివాహాలను నియంత్రించడానికి జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సుల నిర్వహణకు ఆదేశించింది. ఇప్పటి వరకు 15మండలాల్లో సదస్సులు పూర్త య్యాయి. డిసెంబర్ 6 వరకు మిగతా మండలాలను పూర్తిచేస్తాం. మీ ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరిపించే ప్రయత్నం చేస్తే చైల్డ్ హెల్ప్‌లైన్-1098, పోలీస్ హెల్ప్‌లైన్-100, వుమెన్ హెల్ప్‌లైన్-181 కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వవచ్చు. బాల్యవివాహాల నియంత్రణకు అందరూ సహకరించాలి.

కొండగట్టు అగ్ని ప్రమాద నివేదిక పంపండి

- అధికారులను ఆదేశించిన సీఎం
- ముఖ్యమంత్రిని కలిసి ఆదుకోవాలన్న మంత్రి, ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

మల్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిగువ కొండగట్టులో అగ్నిప్రమాదానికి సంబంధించిన నివేదికను వెంటనే పంపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి ప్రమాద ఘటన గురించి వివరించారు. ప్రమాదంలో ముప్పైకి పైగా దుకాణాలు కాలిపోయి అనేక కుటుంబాలు నిరాశ్రయులు అయ్యాయన్నారు. బాధిత కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల చొప్పున పరిహారం అందించాలని కోరారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. పరిహారం అందజేతకు నివేదిక కోరిన సీఎంకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

విమానాశ్రయం స్థల సర్వే కోసం ఏఏఐ బృందం రాక



పెద్దపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో విమానాశ్రయం ఏర్పాటు కోసం ఈ నెల 3, 4 తేదీల్లో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) బృందం రామగుండం సందర్శించి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తారని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బసంత్‌నగర్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా రామగుండంలో పోర్టు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకవచ్చామని, ఈ విషయ మై పలుమార్లు కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుని కలిసి విజ్ఞప్తి చేశారు. అందుకు సమ్మతించడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రీ- ఫీజిబిలిటీ స్టడీ కోసం 50 లక్షల రూపాయలు కూడా కేంద్రానికి చెల్లించామని పేర్కొన్నారు. సోమవారం మరోసారి కేంద్ర మంత్రిని కలిసి త్వరగా సర్వే చేపట్టాలని కోరగా, ఆయన వెంటనే స్పందించారని తెలిపారు. ఈ నెల 3 లేదా 4వ తేదీన ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా బృందం రామగుండం సందర్శించనున్నదని ఎంపీ వంశీకృష్ణ పేర్కొన్నారు. ఇక్కడ ఎయిర్ పోర్టు నిర్మాణమైతే పెద్దపల్లి, మంచిర్యాల, జగిత్యాల, ఆసిఫాబాద్, తదితర జిల్లాల వాసులకు రవాణా సౌకర్యం మరింత మెరుగు పడనున్నదని అన్నారు.

ఆదమరిస్తే.. అనంతలోకాలకే

సెప్టిక్ ట్యాంక్ మ్యాన్ హోల్స్‌తో పొంచి ఉన్న ప్రమాదం

జగిత్యాల టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో ఇదివరకే ఏర్పాటు చేసిన రోడ్లు ఉన్నప్పటి ఈ మధ్యకాలంలో అధికారులు కొత్త రొడ్డు నిర్మాణం చేశారు. ఈ రోడ్డు ప్రమాదకరంగా మారింది. అధికారులు రోడ్డు నిర్మాణం చేస్తున్న క్రమంలో 60 యేళ్ల కిందట ఎస్సారెస్పీ అధికారుల కోసం క్వార్టర్లు నిర్మించి వాటి కోసం పెద్ద సెప్టిక్ ట్యాంక్‌లు కట్టారు. అధికారులు సెప్టిక్ ట్యాంక్ అడ్డుగా వచ్చిన చోట రోడ్డును కొంత మలుపు తిప్పి నిర్మాణం చేశారు. అక్కడే ప్రైమరీ స్కూల్, హైస్కూల్‌తో పాటు వైద్య విద్యార్థుల వసతి గృహాలు ఉన్నాయి. అధికారులు కొత్త రోడ్డు నిర్మించడంతో ఇటు విద్యార్థులు, నిత్యం వాకింగ్ చేసే వాకర్లు సైతం ఇదే రోడ్డును ఉపయోగిస్తున్నారు.



మ్యాన్‌హోల్స్‌ను చూపిస్తున్న విద్యార్థులు

రోడ్డును ఆనుకొని గడ్డితో కప్పబడి ఏర్పడకుండా ఉన్న సెప్టిక్ ట్యాంక్ మ్యాన్ హోల్స్ పెను ప్రమాదంగా మారాయి. గమనించకుండా ముందుకు సాగితే మ్యాన్ హోల్స్‌లో పడే ప్రమాదం ఉంది. వీధిలైట్లు కూడా లేవని ప్రమాదకర మ్యాన్ హోల్స్‌ను పూర్తిగా మూసివేయాలని స్థానికులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

తిమ్మాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతున్న ఓ యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా సంఘటన స్థలంలోనే తీవ్రగాయాలతో మృతి చెందాడు. ఎల్ఎండీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని రేకుర్తికి చెందిన పొన్నం శ్రీకాంత్ గౌడ్(32) హైదారాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం ఉదయం హైదారాబాద్ నుంచి కరీంనగర్‌లోని ఇంటికి వచ్చినట్లు సమాచారం. సోమవారం రాత్రి తిమ్మాపూర్ వైపు వచ్చిన పొన్నం శ్రీకాంత్‌గౌడ్ కరీంనగర్ వెళ్తున్నాడు. ఈక్రమంలో తిమ్మాపూర్ రాజీవ్ రహదారి పక్కనున్న ఓ మటన్ ట్రెడర్స్ సమీపంలో తన ద్విచక్ర వాహనాన్ని ఆపి రోడ్డుకు అవతలి వైపునకు వెళ్తున్నాడు. శ్రీకాంత్‌గౌడ్‌ను కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో తీవ్రగాయాలతో శ్రీకాంత్‌గౌడ్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ మృతదేహాన్ని కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా మృతుడు శ్రీకాంత్‌గౌడ్ కరీంనగర్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు పొన్నం అనిల్ గౌడ్ సోదరుడు.



శ్రీకాంత్‌గౌడ్(ఫైల్)

ఆ రెండు గ్రామాల్లో ఎన్నికలు లేవు..

సైదాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంచంద్రాపూర్, కురుమపల్లి గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలపై హైకోర్టు స్టే విధించింది. మండలంలోని 27 గ్రామాల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు ఉండడంతో ఆయా గ్రామాలు సందడిగా కనిపిస్తున్నాయి. రామచంద్రాపూర్, కరుమపల్లి గ్రామాలు మాత్రం వెలవెలబోతున్నాయి. రాంచంద్రాపూర్, కురుమపల్లి గ్రామాలు కలిసి ఉమ్మడి గ్రామ పంచాయతీగా ఉండేది. కురుమపల్లి గ్రామ ప్రజలు తమ ఊరికి ప్రత్యేక గ్రామ పంచాయతీ కావాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి సర్పంచ్ గ్రామసభలో తీర్మానం చేసి కురుమపల్లిని ప్రత్యేక గ్రామ పంచాయతీ చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించారు. దీంతో ప్రభుత్వం కురుమపల్లిని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది. రాంమచంద్రాపూర్‌కు చెందిన కొందరు గ్రామస్థులు కురుమపల్లికి గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు తగిన అర్హతలు లేవని, నిబంధనలకు విరుద్ధంగా రెండు గ్రామాలను విడగొట్టారని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు స్టే విధించింది. దీంతో ఈ గ్రామాల్లో ఎన్నికలను అధికారులు నిలిపివేశారు. ఈ రెండు గ్రామాలకు అధికారులు రిజర్వేషన్లు ఖరారు చేశారు. రాంచంద్రాపూర్‌కు జనరల్, కురుమపల్లికి బీసీ జనరల్ కేటాయించారు. ఆశావాహులు ఎన్నికలు జరుగుతాయని ఏర్పాట్లు చేసుకున్నారు. ఈదశలో హైకోర్టు స్టే విధించడంతో ఎన్నికలు నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో ఆశావహులు నిరాశ చెందారు.



రాంచంద్రాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

మల్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినీలు ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన హారిక, యశశ్విని, తేజస్విని, నిత్యశ్రీ, చందన జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపిక కాగా విద్యార్థినులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో అధ్యాపకులు

వేములవాడలో భక్తజన సందోహం



ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి

వేములవాడ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వేములవాడ ఆలయం భక్తజన సందోహంతో నిండుకుంది. సోమవారం భక్తులరద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 50 వేల మంది భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎల్ఈడీ స్ర్కీన్‌లో రాజరాజేశ్వర స్వామివారిని, భీమేశ్వరాలయంలో స్వామివారిని దర్శించు కుని తరించారు. భీమేశ్వరాలయంలో అభిషేకం, అన్నపూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఇందుకు నాలుగు గంటల సమయం పట్టింది. భీమేశ్వరాలయం ఎదురుగా ఉన్న అన్నదాన సత్రం పైఅంతస్తులో కల్యాణం, సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. కల్యాణానికి అనూహ్యంగా భక్తుల సంఖ్య పెరగడంతో 117 టికెట్లు జారీ చేశారు. కేవలం దంపతులను మాత్రమే అనుమతించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రమాదేవి పర్యవేక్షిస్తూ తగిన ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు స్నానాలకు, తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. తగినన్ని పాయింట్స్ లేకపోవడంతో భక్తులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఆలయానికి వచ్చే వాహనాలను భీమేశ్వరాలయం వైపు అనుమతించలేదు. పార్కింగ్, అన్నదానసత్రం వద్ద నోఎంట్రీ బోర్డులు పెట్టారు. దీంతో భక్తుల వాహనాలు ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడ్డారు.

బద్దిపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ పట్టణంలోని బద్ది పోచమ్మ ఆలయం భక్తులతో రద్దీగా మారింది. భీమేశ్వరస్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో బద్దిపోచమ్మ ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీల్లో ఉమ్మడి జిల్లాకు తృతీయ స్థానం



ఉమ్మడి జిల్లా బాలుర ఖో-ఖో జట్టు సభ్యులతో అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ ఖో-ఖో పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరులో గత నెల 28, 29, 30 తేదీల్లో 44వ రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖో-ఖో పోటీలు నిర్వహించారు. సెమీఫైనల్‌లో ఆదిలాబాద్ జట్టుతో తలపడి ఓటమి చెంది తృతీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా బాలుర జట్టును జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి సురేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు, జిల్లా ఖో-ఖో సంఘ సభ్యులు ట్రాఫిక్ ఆర్ఐ కుమారస్వామి, వి.సూర్య ప్రకాశ్, చిట్టి తిరుపతిరెడ్డి, డాక్టర్ ఎ.రవీందర్, డాక్టర్ వి.నవీన్ కుమార్, ఎస్‌కే మొయినుద్దీన్, కట్ట సంతోష్, బి.శేఖర్, ఆర్.తిరుపతిరెడ్డి, యోగేష్, వి.శ్రీలత, పి.జ్యోతి, జి.రేణుక, సంధ్య, ఖో-ఖో కోచ్‌లు నరేష్, వెంకటేష్, ఆనంద్, జలంధర్, కరుణాకర్, అశోక్ అభినందించారు.

పెన్షనర్ల బకాయిల కోసం..
ప్రత్యేక నిధులు విడుదల చేయాలి

- 'రేవా' రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయుల (పెన్షనర్ల) బకాయిల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేయాలని రిటైర్డు ఉద్యోగుల సంక్షేమ సంఘం (రేవా)రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఫిలింభవన్‌లో ఏర్పాటు చేసిన రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 నెలలుగా ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యూటీ రూపాయలను ప్రభుత్వం ఇవ్వలేదని, పదవీ విరమణ పొందిన వెంటనే ఇవ్వాల్సిన వీటిని ఇప్పటి వరకు ఇవ్వక పోవడంతో పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చాలామంది అనారోగ్యాలకు గురై చనిపోతున్నారని ఆవేద న చెందారు. ఈ విషయమై పెన్షనర్ల సంఘాలు హైదరా బాద్ ఇందిరాపార్కు వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేయడంతో స్పందించిన ప్రభుత్వం రూ.707.30 కోట్లు విడుదల చేసిందని అన్నారు. అవి కేవలం పదవిలో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు మాత్రమే వారి పెండింగ్ బకాయిల చెల్లింపులకు సరిపోతాయే తప్ప పెన్షనర్లకు బకాయిల చెల్లింపులు జరగవని, ప్రభుత్వ ప్రత్యేక నిధులు పెన్షనర్ల కోసం విడుదల చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకిశాల ప్రభాకర్‌రావు మాట్లాడుతూ పెన్షనర్లందరికి ఏక మొత్తంగా బకాయిలను చెల్లించేందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు అవసరమైన కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గద్దె జగదీశ్వరచారి, కోశాధికారి కనపర్తి దివాకర్, జగిత్యాల జిల్లా ప్ర ధాన కార్యదర్శి ఎం.రాంరెడ్డి, సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు వంగ సుధా కర్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పోనమల్లు రాములు, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, కోశాధికారి రాజిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రేవా రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు చరితేష్ ప్రాజెక్టు

శంకరపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుల పోటీలకు శంకరపట్నం మండలం మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ముత్తునూరి చరితేష్ ప్రాజెక్టు ఎంపికైంది. సీనియర్స్ విభాగంలో వాహన ప్రమాదాన్ని నిలువరించే వాస్‌కోట్ ప్రాజెక్టు ఎంపికైనట్లు ఉపాధ్యాయుడు బాబు తెలిపారు. సోమవారం కరీంనగర్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో ప్రదర్శించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా హెచ్ఎం కంకణాల నీరజ, ఉపాధ్యాయులు అభినందించారు.

పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

-సారంగాపూర్ ఎంపీడీవో సలీం

జగిత్యాలరూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) :పోలింగ్ కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని సారంగాపూర్ ఎంపీడీవో మహమ్మద్ సలీం అధికారులకు సూచించారు. సారంగాపూర్ మండలం లోని పెంబట్ల, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి లైట్, ఫ్యాన్ ర్యాంప్ సరిపడా ఫర్నిచర్ ఉండేవిధంగా తగిన ఏర్పాట్లు చేయాలని సారంగాపూర్ ఎంపీడీవో మహమ్మద్ సలీం అన్నారు. ఈకార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

ఇబ్రహీంపట్నం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం లోని పలు పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో గణేష్ సోమవారం పరిశీలించారు. రాబోయే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నేపథ్యంలో ఆయన పలువురు అధికారులతో కలిసి ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాల గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్ ఏర్పాట్లను పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎన్నికల పోలింగ్ వేళ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారికి సూచించారు.

నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో

కొడిమ్యాల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలంలోని పూడూర్ గ్రామంలోని గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని సోమవారం ఎంపీడీవో స్వరూప పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో ప్రజల నుండి వస్తున్న నామినేషన్ పత్రాలను సరిగా చూసుకోవాలన్నారు. నామినేషన్ కేంద్రాలలో సర్పంచు, వార్డు సభ్యత్వాలకు అందించు అభ్యర్థులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఎంపీడీవో స్వరూప అన్నారు. ఎంపీడీవో వెంట గ్రామ కార్యదర్శి ఉన్నారు.

వైద్య పరీక్షలు

కోరుట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పద్మశాలి సంఘ భవనంలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మోతె బిందు నిర్ధారణ వైద్య పరీక్ష శిబిరంను నిర్వహించారు. శిబిరంలో 65 మందికి వైద్య పరీక్షలను నిర్వహించిన రేకూర్తి వైద్య సిబ్బంది నిర్వహించారు. 22 మంది మోతె బిందు సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి శస్త్ర చికిత్స నిమిత్తం ప్రత్యేక వాహనంలో లయన్స్ క్లబ్ సభ్యులు వారిని రేకూర్తికి తరలించారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు జీవన్ రెడ్డి, ఏలేటి లక్ష్మారెడ్డి, నల్ల గంగాధర్, అజయేందర్ రావు, అడెపు మధు, అల్లాడి ప్రవీణ్ కుమార్, ఉషాకిరణ్, మంచాల జగన్, స్వరాజు, గుణాకర్ రెడ్డి, మండలోజి రవీందర్, కల్లెం గంగాధర్ రెడ్డి, బెజంకి శ్రీనివాస్ రావు, భూంరెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీ



జగిత్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ కళాశాల విద్యార్థులు, కొడిమ్యాలలో వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ

జగిత్యాల, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నియంత్రణపై సరియైన అవగాహణ అవసరమని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తిరుపతి అన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినాన్ని నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి సంక్రమణ, నిర్మూలన కోసం చేపట్టవలసిన చర్యలు, బాధితులకు అందే సహాయం గురించి అధ్యాపకులు వివరించారు. ఎయిడ్స్ వ్యాధి పై అవగాహన పరుస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కళాశాల విద్యార్థినులు అభినయ, మెహవిష్, సంస్కృతి బహుమతులు సాధించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొట్టాల తిరుపతిరెడ్డి, అధ్యాపకులు సునీత, సాయి శిల్ప, దేవ, స్వరూప, జగన్, ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి టౌన్:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రాజారాం ట్రస్టు చైర్మన్ రాజరత్నాకర్ ఎయిడ్స్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు శరీరంలో జరిగే పరిమాణాలు, దాని ఫలితాల వల్ల కలిగే విధానాలను చక్కగా వివరించారు. ప్రతి ఒక్కరు ఎయిడ్స్ వ్యాధి బారిన పడకుండా ఉండాలని తెలిపారు. అలాగే మెట్‌పల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంపై విద్యార్థులకు డాక్టర్ పుప్పాల సంధ్యారాణి అవగాహన కల్పించారు. ఎయిడ్స్‌పై పలు అపోహలను వివరించి, వాటి వల్ల కలిగే అనర్థాలు, నివారణ ఉపాయాలను వివరించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెల్ముల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన పోషక ఆహారం తీసుకొని అందరూ ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జైపాల్ రెడ్డి, కోశాధికారి వేములవాడ చంద్రశేఖర్, ఇల్లెందుల శ్రీనివాస్, డాక్టర్ పుప్పాల సాగర్, ఆల్‌రౌండర్ గంగాధర్, ప్రిన్సిపాల్ దేవరాం తదితరులు పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైద్యాధికారిణి పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, సూపర్‌వైజర్లు వెంకటనర్సమ్మ, అలివేలు, నర్సింగ్ ఆఫీసర్స్ లావణ్య, శ్రీజ, ఫార్మాసిస్ట్ శ్రీలత, ఎల్.టీ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

●మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ కె. వేణు ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ రోగులతో స్నేహపూర్వకంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.భాస్కర్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి వేడుకలు


గీతా యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలోని వేంపేట గ్రామంలో గీతా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్గశిర మాస శుద్ధ ఏకాదశి సోమవారం పురస్కరించుకుని శ్రీరామకృష్ణ సంకీర్తన మండలి గాజంగి రాజమల్లయ్య ఆధ్వర్యంలో ఉదయం ఐదు గంటల నుంచి శ్రీకృష్ణాధ్యాన కార్యక్రమాలు జరిపారు. అనంతరం సభ్యులు భగవద్గీత లోని 18 అధ్యాయాలను పారాయణం చేశారు. భగవద్గీత లోని సారాంశాన్ని వివరించారు. ప్రతి ఒకరూ గీతను చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామకృష్ణ సంకీర్తన మండలి సభ్యులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గీతా యజ్ఞం

ధర్మపురి: ధర్మపురి మండలంలోని తీగలధర్మారం గ్రామంలో గల శ్రీ కృష్ణ గీతాశ్రమంలో సోమవారం గీతా యజ్ఞం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ కృష్ణ గీతా శ్రమం అధ్యక్షులు వేముల రాజరెడ్డి ఆధ్వర్యంలో జగిత్యాల గాయిత్రి పరివార్ నిర్వాహకులు వేముల రాంరెడ్డి శాస్త్రోక్తంగా పంచకుండీ గీతా యజ్ఞం, పారాయణం, శ్రీ కృష్ణాభిషేకం, తులసీ అర్చన, గోపూజ, పూర్ణాహుతి కార్యాక్రమాన్ని నిర్వహించారు. అనేక మంది దంపతులు భక్తి శ్రద్ధలతో యజ్ఞంలో పాల్గొని పూజలు నిర్వహించారు. గంటల తరబడి భక్తులు గీతా పారాయణం, భజనలు చేశారు. రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్య ఐశ్వర్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీ కృష్ణ పరమాత్ముడిని వేడుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తీగలధర్మారం మాజీ సర్పంచ్ జంగిలి ప్రభాకర్, గందం రమేష్, వేముల సుధాకర్‌రెడ్డి, వేముల మల్లన్న, గుర్రం సుధాకర్‌రెడ్డి, కొనన జీవన్‌రెడ్డి, సుధాకర్‌రావు, బాపురెడ్డి, చిగిరి జలపతి, వివిధ గ్రామాల గీతా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): అన్ని సేవలకంటే ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని, సమాజాన్ని మార్చడానికి భగవంతుడు కల్పించిన అదృష్టమని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. సోమవారం మెట్‌పల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఎస్సారెస్పీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చౌకి వేణుగోపాల్ ఉద్యోగ విరమణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చౌకి వేణుగోపాల్ ఉపాధ్యాయ వృత్తికి ఎంతో వన్నె తెచ్చారని, డ్రాప్ అవుట్‌లను కాకుండా చూశారని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఆయన కృషి అమోఘమని కీర్తించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మేకల చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు కనక తార, మహర్షి, ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు బోనగిరి దేవయ్య, ఆనంద్ రావు, శ్యాంకుమార్, చిన్నయ్య, గణేష్, నర్సింగ్ రావు, విజయ భాస్కర్, వేణుగోపాల్, బాలకిషన్, తపస్ జిల్లా కార్యదర్శులు వేముల శ్రీలత, భవాని, మండల అధ్యక్షులు మేకల మనోజ్, గోనెల ప్రసాద్, కార్యదర్శులు జయేందర్, రఘునాథ్ పాల్గొన్నారు.

బుజ్జగింపులు షురూ

(ఐదో పేజీ తరువాయి)

బరిలో ఉంటారో తెలియనుంది. కొన్ని చోట్ల ఖర్చులకు భయపడి అవగాహనతో పలువురు అభ్యర్థులు ఏకగ్రీవం వైపు ఆలోచిస్తున్నారు.

● **ఉపసంహరణకు రేపటి వరకు గడువు**

జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా గత నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. గత నెల 30వ తేదీన నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటు అయిన నామినేషన్ల ప్రకటన, ఈనెల 1వ తేదీ వరకు అప్పీల్ స్వీకరించారు. ఈనెల 2వ తేదీన అప్పీళ్ల పరిష్కారం, 3వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ, పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటన జరగనుంది. ఈనెల 11వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభించి ఫలితాల ప్రకటన, ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహించనున్నారు.

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

-ఎస్పీ అశోక్ కుమార్


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డే సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ఐదుగురు ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషిచేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూస్తున్నామని పేర్కొన్నారు.

నిరాశ్రయులకు ఆపన్నహస్తం

మల్యాల, డిశంబరు 1(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులు అయిన బాదిత కుటుంబాలకు అండగా నిలబడి, ఆపన్నహస్తం అందించడానికి అనేక మంది ముందుకు వస్తున్నారు. శనివారం అర్థరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో చిరు వ్యాపారుల బొమ్మల దుకాణాలు బుగ్గి కావడం, కట్టుబట్టలతో బయటపడడంతో ఆదుకునేందుకు వివిధ సంస్థలు, సంఘాలు, యువకులు సాయం అందిస్తున్నారు. హైదరాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయంకు చెందిన అర్చకులు ఆత్మారాం మహారాజ్ స్వామి ముప్పయి కుటుంబాలకు 25కిలోల చొప్పున బియ్యం సంచీలు అందించారు. స్థానిక గౌడ సంఘం తరుపున రూ.50వేల సాయం చేయనున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. ముత్యంపేట ఫ్రెండ్స్ యువజన సంఘం సభ్యులు రూ.10వేల నగదు సాయం అదించారు. ఫ్రీడం ఆయిల్ కంపెనీ ప్రతినిధులు రూ.40వేల విలువైన దుస్తులు అందించారు. అలాగే జగిత్యాల వర్తక సంఘం ఆధ్వర్యంలో నిత్యవసరాల సరుకులను డిఎస్పీ రఘుచందర్ బాదిత కుటుంబసభ్యులకు పంపిణీ చేశారు. సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ తదితరులు ఉన్నారు. వీరితో పాటు స్థానిక నాయకులు, అనేక మంది బోజనంకు ఇతరాత్ర సాయం అందించేందుకు ముందుకు వస్తున్నారు.

● **మాజీ ఎమ్మెల్యేల పరామర్శ**

అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాదితులను మాజీ ఎమ్మెల్యేలు బొడిగే శోభ, సుద్దాల దేవయ్య ఓదార్చారు. ఘటన వివరాలు తెలుసుకొని ప్రమాదం బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. నష్టం పరిహారం పూర్తి స్థాయిలో ఇవ్వాలని అన్నారు. వారి వెంట బీజేపీ నాయకులు మల్లేశం, మహిపాల్‌రెడ్డి, రమేశ్, గౌతం, లత, హర్షవర్ధన్ ఉన్నారు.

సర్పంచ్ పదవి ఏకగ్రీవానికి వీడీసీ సభ్యుల యత్నం?

కోరుట్ల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామంలో సర్పంచ్ పదవిని వీడీసీ సభ్యులు ఏకగ్రీవం కోసం యత్నించినట్లు సమాచారం. సోమవారం వీడీసీ సభ్యులు ఒక ప్రాంతంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నామినేషన్ల దాఖలు చేసిన వారిని పిలవడానికి ప్రయత్నించినట్లు తెలిసింది.

చిన్నమెట్‌పల్లి గ్రామంలో సర్పంచ్ పదవి కోసం ఆరుగురు నామినేషన్లు దాఖలు చేశారు. సమావేశానికి నామినేషన్ల దాఖలు చేసిన వారు హాజరు కాకపోవడంతో వీడీసీ సభ్యులు వెనుతిరిగినట్లు తెలిసింది. గ్రామ అభివృద్ధికి రూ.10లక్షలకు పైగా ఇస్తే అభ్యర్థిని ఏకగ్రీవం చేసేందుకు వీడీసీ సభ్యులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

మూడో విడతకు నామినేషన్ కేంద్రాల ఏర్పాటు

పెగడపల్లి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) పెగడపల్లి మండలంలో నామినేషన్ల స్వీకరణకు 8 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ రావు తెలిపారు. మూడవ విడతలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు గాను ఈనెల 3 నుండి నామినేషన్ల స్వీకరణ చేయనున్నట్లు తెలిపారు. పెగడపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పెగడపల్లి, వెంగళాయిపేట, ఏడు మోటలపల్లి గ్రామాల అభ్యర్థులు, నందగిరి గ్రామపంచాయతీలో నందగిరి, అయిత్‌పల్లి గ్రామాల అభ్యర్థులు, మ్యాక వెంకయ్యపల్లి గ్రామ పంచాయతీలో నామాపూర్, నార్సింహానిపేట, కీచులాటపల్లి, మ్యాకవెంకయ్యపల్లి గ్రామాల అభ్యర్థులు నామినేషన్లు వేయాలన్నారు. ఎల్లాపూర్ గ్రామపంచాయతీలో ఎల్లాపూర్, రామ బద్రునిపల్లి, రాజా రాంపల్లి, ల్యాగలమర్రి గ్రామాల అభ్యర్థులు, ఆరవెల్లిలో గ్రామ పంచాయతీలో ఆరవెల్లి, మద్దులపల్లి,దోమలకుంట గ్రామాల అభ్య ర్థులు, నంచర్లలో నంచర్ల, దీకొండ, రాములపల్లి అభ్యర్థులు, బతికెపల్లిలో బతికెపల్లి అభ్యర్థులు, లింగాపూర్ గ్రామంలో లింగాపూర్, సుద్దపల్లి, శాలపల్లి గ్రామాల అభ్యర్థులు సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ దాఖలు చేసుకోవాలని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ తెలిపారు.

గొల్లపల్లి మండలంలో..

●**గొల్లపల్లి:** గొల్లపల్లి మండలంలో ఈ నెల 3 నుంచి ప్రారంభమయ్యే సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకారణ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రవీంధర్ రావు తెలిపారు. సోమవారం ఎంపీడీవో గొల్లపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలోని మొత్తం 27 గ్రామ పంచాయతీలకు గాను ఆరు క్లష్టర్ గ్రామాలుగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

ఆరు క్లస్టర్ గ్రామాల్లో నామినేషన్ల కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఆయా క్లష్టర్ గ్రామాల కింద విభజింపబడిన గ్రామాల నామినేషన్లను ఆయా కేంద్రాల్లో స్వీకరిస్తారని పేర్కొన్నారు. మొదట గొల్లపల్లి క్లష్టర్ పరిధిలో గొల్లపల్లి, గోవిందు పల్లె, రాపల్లె గ్రామాలు, రెండవ క్లష్టర్‌గా మండలంలోని రాఘవ పట్నం కేంద్రంలో రాఘవ పట్నం, గంగాదేవి పల్లె, అగ్గిమల్ల, గుంజపడుగు గ్రామాల అభ్యర్థులు, మూడవ క్లష్టర్‌గా తిర్మలాపూర్ (పీడీ) తిర్మలాపూర్ (పీడీ), ఆత్మకూర్, దమ్మన్న పేట, లక్ష్మీపూర్, రంగదాముని పల్లె అభ్యర్థులు, నాలుగవ క్లష్టర్‌గా చిల్వాకోడూర్ కేంద్రంలో చిల్వాకోడూర్, చెందోళి, దట్నూర్, భీంరాజ్ పల్లె, అబ్బాపూర్ గ్రామాల అభ్యర్థులు, ఐదవ క్లష్టర్‌గా మండలంలోని వెన్గుమట్ల కేంద్రంలో వెన్గుమట్ల, బొంకూర్, లొత్తునూర్, ఇబ్రాజ్ పల్లె, గ్రామాలకు సంబంధించిన అభ్యర్థులు, ఆరవ కేంద్రంగా మండలంలోని శ్రీరాముల పల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో శ్రీరాముల పల్లె, బీబీరాజ్ పల్లె, శంకర్రావు పేట, తిర్మలాపూర్ (ఎం), వెంగళాపూర్, నందిపల్లె గ్రామాల అభ్యర్థులు ఆయా గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటి చేస్తున్న అభ్యర్థులు ఆయా గ్రామాలకు కేటాయించిన నామినేషన్ స్వీకారణ కేంద్రంలో నామినేషన్లను దాఖలు చేయవచ్చని ఎంపీడీవో వివరించారు.

ధర్మపురి మండలంలో 35,389 మంది ఓటర్లు

ధర్మపురి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలో మూడో విడత జరిగే 25 సర్పంచ్, 224 వార్డు సభ్యుల స్థానాల కోసం మొత్తం 35,389 మంది ఓటరులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారు. ఇందులో 17,170 మంది పురుషులు, 18,218 మంది మహిళలు, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. మండలంలోని 25 గ్రామపంచాయితీల కోసం జరిగే ఎన్నికల్లో 37 ప్రదేశాలను గుర్తించి 224 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జగిత్యాల జిల్లా అసిస్టెంట్ ఎన్నికల అధికారి, ఇంచార్జ్ ఎంపీడీవో నరేష్‌కుమార్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ మహేష్ మండలం లోని మొత్తం ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

గ్రంథాలయంలో ఉద్యోగార్థులకు మధ్యాహ్న భోజనం


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉద్యోగార్థులకు భోజనం పెడుతున్న దాతలు

జగిత్యాల అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రం చుట్టు పక్కల నుంచి వచ్చి జిల్లా కేంద్రంలో కేంద్ర గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షల కోసం సిద్ధపడే యువతీ యువకుల కోసం అమెరికా, ఆస్ట్రేలియాలో ఉన్న జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన యువకులు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. అమెరికాలో ఉంటున్న జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సామ ఉమాపతి కుమారుడు అభినయ్ మిత్ర బృందం మరియు ఆస్ట్రేలియాలో ఉంటున్న మరో వ్యాపారవేత్త కోటగిరి శ్రవణ్ కుమారుడు రంజిత్‌లు మిత్రుల ద్వారా సేకరించిన మూడు లక్షల రూపాయలతో మూడు నెలల పాటు ఉచిత మధ్యాహ్న బోజనం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

'ఎన్నికల కోడ్ పాటించాలి'

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రికి, మంత్రులకు ఎన్నికల కోడ్ వర్తించదా అని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దావ వసంత అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలు పై నవంబర్ 26నే ఎన్నికల సంఘం స్పష్టత ఇచ్చినప్పటికి అభివృద్ధి పేరుతో ముఖ్యమంత్రి జిల్లాల పర్యటన చేయడం కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని అన్నారు. ప్రభుత్వ సొమ్ముతో అర్బన్ ఏరియాల్లో అభివృద్ధి పనుల పేరిట గ్రామాల నుంచి జనాలను పోగు చేసి ఎన్నికల ప్రచారం నిర్వహించాలనే ప్లాన్ వేశారని ఆరోపించారు. ఆ సమావేశంలో బిఆర్ఎస నాయకులు దేవేందర్ నాయక్, శీలం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత కొనసాగిన నామినేషన్ల పర్వం


తాళ్ళధర్మారం నామినేషన్ కేంద్రం వద్ద రాత్రి బారులు తీరిన అభ్యర్థులు

జగిత్యాల రూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలో సోమవారం సర్పంచ్ స్థానాలకు 67, వార్డు సభ్యుల స్థానాల కోసం 182 నామినేషన్లను స్వీకరించినట్లు ఎంపీడీవో రమాదేవి తెలిపారు. జగిత్యాల అర్బన్ మండలంలో సర్పంచి స్థానాలకు 15, వార్డు సభ్యుల స్థానాల కోసం 51 నామినేషన్లను స్వీకరించినట్లు ఎంపీడీఓ విజయలక్ష్మీ తెలిపారు.

● **సారంగాపూర్ మండలంలో 178 నామినేషన్లు**

సారంగాపూర్ మండలం లో రెండోరోజు సర్పంచులు 43 ,వార్డు మెంబర్లు 135 స్థానాలకు నామినేషన్లు ధాఖలైనట్లు ఎంపీడీవో సలీం తెలిపారు.

● **రాయికల్ మండలంలో 279 నామినేషన్లు**

రాయికల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా సోమవారం రాయికల్ మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు 279 నామినేషన్లు వచ్చాయి. మండలంలో సర్పంచ్ స్థానాలకు 67 మంది నామినేషన్లు వేయగా, వార్డు సభ్యుల స్థానాలకు 212 నామినేషన్లు వేశారు. మండలంలోని మైతాపూర్, ఒడ్డెలింగాపూర్ గ్రామాల్లో రాత్రి 8:30 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది.

● **బీర్‌పూర్ మండలంలో 122 నామినేషన్లు**

బీర్‌పూర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలో రెండవ విడత ఎన్నికలకు సోమవారం సర్పంచ్ స్థానాలకు 26, వార్డు స్థానాలకు 96 నామినేషన్లు వచ్చాయి. నామినేషన్లు రాత్రి 9 గంటల వరకు కొనసాగాయి. మండలంలో నాలుగు నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయగా బీర్‌పూర్ క్లస్టర్‌లో సర్పంచ్ స్థానాలకు ఐదు, వార్డులకు 14 నామినేషన్లు వచ్చాయి. కొల్వాయి క్లస్టర్‌లో సర్పంచ్ స్థానాలకు 11, వార్డు స్థానాలకు 36 నామినేషన్లు దాఖలు అయ్యాయి. తాళ్ళధర్మారం క్లస్టర్‌లో సర్పంచ్ స్థానాలకు 3, వార్డు స్థానాలకు 20 నామినేషన్లు వచ్చాయి. మంగేళ క్లస్టర్‌లో సర్పంచ్ స్థానాలకు 7, వార్డు స్థానాలకు 26 నామినేషన్లు దాఖలయ్యాయని ఎంపీడీవో భీమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు నామినేషన్ కేంద్రాల రిటర్నింగ్ అధికారులు మధుసుధన్, తిరుపతి, సత్యనారాయణ మూర్తి, సాంబమూర్తి, కార్యదర్శులు రవి, ఆదిత్య తదితరులు ఉన్నారు.

● **మల్యాల మండలంలో 240 నామినేషన్లు**

మల్యాల: మండలంలో రెండవరోజు సోమవారం సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు 240 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎంపీడీవో స్వాతి తెలిపారు. 19 సర్పంచ్ స్థానాలకు గాను 48, వార్డు స్థానాలకు 192 మంది నామినేషన్లు అందించినట్లు పేర్కొన్నారు.

● **కొడిమ్యాల మండలంలో 239 నామినేషన్లు**

కొడిమ్యాల: కొడిమ్యాల మండలంలోని 24 గ్రామ పంచాయతీలలోని ఏడు నామినేషన్ కేంద్రాలలో సోమవారం 239మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేసినట్లు ఎంపీడీవో స్వరూప తెలిపారు. సర్పంచ్ పదవికి 66, వార్డు స్థానాలకు 173మంది నామినేషన్లను అందించారు.

డీసీసీ అధ్యక్షుడి పూజలు

జగిత్యాలరూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం లోని పొలాస లలితమాత ఆలయంలో జగిత్యాల కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య పూజలు నిర్వహించారు. పొలాస గ్రామానికి చెందిన నందయ్యను కాంగ్రెస్ అధిష్టానం జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియామకం చేయగా సోమవారం 108 శ్రీచక్ర సహిత లలిత మాత ఆలయానికి సతీసమేతంగా వచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం లలిత మాతకు నందయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం పక్షాన నందయ్యను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో నలుమాసు గంగాధర్, మాజీ సర్పంచ్ గాజంగిభారతి, సత్తయ్య పాల్గొన్నారు.

'పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి'


అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ అభివృద్ధికి నిరంతర కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జగిత్యాల పట్టణంలోని 11వ వార్డులో రూ. 11 లక్షలతో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అంతకుముందు 1వ వార్డులో రూ. 5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధిక నిధులు జగిత్యాల పట్టణానికి మంజూరు చేయించానని, ప్రతి వార్డులో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ఆనంద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాము, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ కౌన్సిలర్లు బాలే శంకర్, డిష్ జగన్, రాము, కూసరి అనిల్, పద్మావతి పవన్ పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజ

కోరుట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్త మున్సిపల్ సమీపంలో సోమవారం నిర్వహించిన అయ్యప్ప పడిపూజ మహోత్సవం స్వాములను అలరింపజేసింది. గుండెటీ రమేష్ స్వామి 18వ సారి అయ్యప్ప దీక్ష స్వీకరించంగా గూడెంగురు స్వామి చక్రవర్తుల పురుషోత్తమచార్య మంత్రోచ్చరణ మధ్య పదునెట్టాబండి పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప, సుబ్రమణ్య స్వాములకు పంచా మృత అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో గురు స్వాములు బ్రహ్మణగారి శంకర్ శర్మ, గట్ల అనంద్, రవీగౌడ్, అండటి శ్రీనివాస్‌లతో పాటు అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

●కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని దేవాలయ అభివృద్ధి కమిటి సభ్యులు ప్రారంభించారు. ప్రతి సంవత్సరం దేవాలయంలో అయ్యప్ప అభివృద్ధి కమిటి సభ్యుల అద్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని స్వాములు ప్రత్యేక పూజలను నిర్వహించి అన్నప్రసాద్‌ను వితరన చేసారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

లక్షా 60 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు

కథలాపూర్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని మూడు ప్రాథమిక సహకార సంఘాల ఆద్వర్యంలో సోమవారం నాటికి లక్షా 60 వేల క్వింటాళ్ళ వరి ధాన్యం కొనుగోలు చేసినట్టు సీఈఓలు తెలిపారు. భూషణరావుపేట విండో ఆధ్వర్యంలో 98 వేలు, సిరికొండ విండోలో 22 వేలు, గంభీర్‌పూర్ విండోలో 40 వేల చొప్పున రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశామని సీఈఓలు రాంప్రసాద్, అరుణ్, విజయ్ తెలిపారు.

ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో ఎప్పటికప్పుడు జమ కాబడుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.